క్లుప్తంగా

పారిశుద్ధ్య పనులను పరిశీలించిన కమిషనర్



తిరుపతి తుడా: నగరంలోని గాంధీభవన్ పరిసరాలతో పాటు, అలిపిరి ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య మంగళవారం ఉదయం పరిశీలించారు. గాంధీభవన్‌లో బోరు మరమ్మతులు చేయించాలని, పారిశుద్ధ్యం మెరుగు పరచాలని భవన్ సభ్యులు కోరారు. బోరు మరమ్మతులు చేసి, మురుగునీరు వెళ్లే పైపులైను బాగు చేయాలని, అలిపిరి పరిసర ప్రాంతాల్లో ఉన్న దుకాణదారులు చెత్తా చెదారం రోడ్ల పక్కన వేయకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆమె ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, మునిసిపల్ ఇంజినీర్ గోమతి, హెల్తాఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, ఏసీపీ మధు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

5కే రన్‌కు విశేష స్పందన



ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ

తిరుపతి తుడా: జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ విభాగం ఆధ్వర్యంలో రెడ్ రన్ (5కిలోమీటర్లు) మారథాన్ మంగళవారం ఉదయం స్థానిక అలిపిరి వద్ద భారతీయ విద్యాభవన్ గ్రౌండ్ నుంచి టాటా క్యాన్సర్ ఆసుపత్రి వరకు నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్ ఈ రన్ ప్రారంభించి మాట్లాడారు. రెడ్ రన్ విషయంలో పోలీసు, వైద్య శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంది. కార్యక్ర మంలో జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ శైలజ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం నుంచి కోటిరెడ్డి, సురేంద్ర పుల్లయ్య, స్వచ్ఛంద సంస్థలు, కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రపంచ ఆత్మహత్య నిరోధక దినోత్సవ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది

తిరుపతి తుడా: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ ఆత్మహత్య నిరోధక దినోత్సవం-2025 ఘనంగా నిర్వహించారు. ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రత్యేక ర్యాలీ డీఎంహెచ్‌ఓ కార్యాలయం నుంచి స్విమ్స్ సర్కిల్ వరకు నిర్వహించారు. కార్యక్రమంలో తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్యాధికారి డాక్టర్ వి.బాలకృష్ణ నాయక్, డీపీఎంఓ డాక్టర్ శ్రీనివాస్‌రావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు, ఏసీడీ పీఓ డాక్టర్ రెడ్డి ప్రసాద్, సైక్రియాటిస్ట్ డాక్టర్ పి.ఉదయ్ కిరణ్, ఇతర ఆరోగ్య కార్యదర్శులు, మానసిక ఆరోగ్య నిపుణులు పాల్గొన్నారు.

కంపల్లె రవిచంద్రన్‌కు కీర్తి పురస్కారం



తిరుపతి కల్చరల్: టీటీడీ సప్తగిరి మాసపత్రిక ప్రత్యేక శ్రేణి ఉప సంపాదకుడు డాక్టర్ కంపల్లె రవిచంద్రన్‌ను హైదరాబాద్ సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్సిటీ కీర్తి పురస్కారం వరించింది. సాహితీ రంగంలో ఆయన సేవలను గుర్తించి ఈ పురస్కారాన్ని ఆ వర్సిటీ ప్రకటించింది. ఈయన ఇప్పటికే ప్రాచీన సాహిత్య విభాగంలో 9 గ్రంథాలు, ఆధునిక సాహిత్య విభాగంలో 7 గ్రంథాలు, సినీ సాహిత్య విభాగంలో 13 పుస్తకాలు, అనువాద సాహిత్య విభాగంలో 6 గ్రంథాలు రాయడంతో పాటు సుమారు ఐదు వేల వ్యాసాలు రాశారు. ఈయనకు ఇటీవలే ఆంధ్రప్రదేశ్ కళారత్న పురస్కారం ఇచ్చి గౌరవించింది.

శ్రీవారి సేవలో..



కుటుంబ సభ్యులతో మహిళా క్రికెటర్ శ్రీ చరణి

తిరుమల: తిరుమల శ్రీవారిని మంగళవారం భారత్ మహిళా క్రికెటర్ శ్రీ చరణి, తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్, తెలంగాణ ఎమ్మెల్యే మల్లారెడ్డి దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలికారు. టీటీడీ అధికారులు లడ్డు ప్రసాదాలు అందజేశారు. కాగా, క్రికెటర్ శ్రీచరణి లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్‌గా తన సత్తా చాటుతోంది.

నోటీస్ బోర్డు

- ఎస్వీ యూనివర్సిటీలో గణాంక శాస్త్రవేత్త 105వ జయంతి సందర్భంగా ఉదయం 10 గంటలకు స్టాటిస్టికల్ కాన్సెప్ట్ ఇన్ క్వాంటమ్ కంప్యూటింగ్ అంశంపై సదస్సు.
- సప్తగిరినగర్‌లోని కమ్మవారి అభ్యుదయ సంక్షేమ సంఘం హాల్లో ఉదయం 10 గంటలకు ఇన్నర్ ఇంజినీరింగ్ కార్యక్రమం ప్రారంభం.

హోరెత్తిన అన్నదాత పోరు



భారీ ర్యాలీగా ఆర్డీఓ కార్యాలయానికి వెళుతున్న పార్టీ నాయకులు, రైతులు

- అన్నమయ్య సర్కిల్ నుంచి వరి పైరు, యూరియా మూటలతో ఆర్డీఓ కార్యాలయానికి నిరసన ర్యాలీ
- చంద్రగిరి, తిరుపతి నియోజక వర్గాల నుంచి భారీగా తరలి వచ్చిన రైతులు, పార్టీ శ్రేణులు
- ఎరువులు ఇవ్వడంలో చేతులెత్తేస్తున్న కూటమి ప్రభుత్వం
- పంటల సాగుకు అష్టకష్టాలు పడుతున్న రైతాంగం
- ఆర్డీఓకు వినతి పత్రం ఇచ్చిన భూమన అభినయ్ రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి

తిరుపతి మంగళం : ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై రైతన్నలు కదం తొక్కారు. తిరుపతిలో మంగళవారం నిర్వహించిన ‘అన్నదాత పోరు’తో తమ నిరసన హోరు వినిపించారు. తిరుపతి, చంద్రగిరి నియోజక వర్గాల నుంచి భారీగా తరలి వచ్చిన రైతులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు ఆర్డీఓ కార్యాలయాన్ని ముట్టడించారు. తొలుత పార్టీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్ రెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి నేతృత్వంలో వేలాది మంది రైతులు, పార్టీ నేతలు, కార్యకర్తలు అన్నమయ్య సర్కిల్ వద్ద నుంచి వరిపైరు, యూరియా మూటలతో ఆర్డీఓ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం భూమన అభినయ్‌రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష, పార్టీ రైతు విభాగం జిల్లా అధ్యక్షులు చంద్రమౌళిరెడ్డి, పార్టీ నగర అధ్యక్షులు మల్లం రవిచంద్రారెడ్డి తదితరులు మాట్లాడారు. రైతులను కూటమి ప్రభుత్వం నిండా ముంచేస్తోందని నిప్పులు చెరిగారు. ఎరువుల కొరత, గిట్టు బాటు ధరలు లేక రైతన్నలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. తమ కష్టాలు, ఆవేదనను సామాజిక మాధ్యమాల్లో చెప్పుకున్నా వారిపై కూడా కేసులు బనాయిస్తామనే స్థితికి కూటమి సర్కారు దిగజారడం హేయమని నిరసించారు. అన్నదాతలకు న్యాయం చేసేంతవరకు పోరాడుతామన్నారు. గతంలో రైతులు రబీ, ఖరీఫ్ సీజన్లలో వ్యవసాయ పనులు ప్రారంభించక ముందే పెట్టుబడి సాయం కింద అప్పటి ముఖ్య మంత్రి జగనన్న ప్రతి రైతు బ్యాంకు ఖాతాకు రూ.7,500 జమ చేస్తే, కూటమి ప్రభుత్వం పెట్టుబడి సాయం ఇవ్వకపోగా అవసరమైన ఎరువులు కూడా సరఫరా చేయలేక చేతులెత్తేస్తోందని దుయ్యబట్టారు. కేంద్రం నుంచి వచ్చే యూరియాను రైతులకు కాకుండా బ్లాక్ మార్కెట్‌కు తరలించి జేబులు నింపుకోవడం చూస్తే ప్రభుత్వం ఎవరి పక్షాన ఉందో ఇట్టే బోధపడుతోందన్నారు.



ఆర్డీఓ కు వినతిపత్రం ఇస్తున్న అభినయ్‌రెడ్డి, హర్షిత్‌రెడ్డి, మేయర్ శిరీష, చంద్రమౌళిరెడ్డి, మల్లం రవిచంద్రారెడ్డి, రైతులు

ఎరువులు, గిట్టుబాటు ధరల కోసం అన్నదాతలు రోడ్డెక్కాల్సిన పరిస్థితిని కల్పించిందని నిశితంగా ఎండగట్టారు. రైతులతో కలిసి ఆర్డీఓ రామ్‌మోహన్‌కు వినతిపత్రం ఇచ్చారు. రైతులకు ప్రభుత్వం ధరలకు సకాలంలో యూరియాను పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



మడక భుజంపై పెట్టుకుని యూరియా ప్లకార్డులతో ర్యాలీగా వెళుతున్న రైతులు, పార్టీ శ్రేణులు

రైతుల కడగండ్లపై రక్తి కట్టించిన ప్రదర్శన

తిరుపతి మంగళం: రైతులు ఎరువుల కోసం పడుతున్న కష్టాలు, బ్లాక్ మార్కెట్‌పై భూమనఅన్నదాత పోరులో అభినయరెడ్డి వినూత్న ప్రదర్శనతో రక్తి కట్టించారు. రైతు సేవా కేంద్రం సెట్టింగ్, కేంద్రంలో సీఎం నారా చంద్రబాబునాయుడు, మంత్రి లోకేష్ తదితరులు కూర్చుని ఉన్న చిత్రం, ఎరువుల కోసం క్యూలో ప్రాధేయపడుతున్న రైతన్నలు, మరో వైపు ఎరువుల బ్లాక్ మార్కెట్..ఇలా అన్నింటినీ ఏక కాలంగా రైతుల కడగండ్లను కళ్లకు కట్టినట్టు సమర్థవంతంగా ప్రదర్శనతో చాటిచెప్పారు. ఇలా ప్రదర్శన చేయడం సరికాదని పోలీస్ అధికారులు అడ్డుకోవడంతో వాగ్వాదం సైతం చోటుచేసుకుంది.



రైతుల కష్టాలను వినూత్న ప్రదర్శనతో చెబుతున్న అభినయ్‌రెడ్డి, హర్షిత్‌రెడ్డి

మొత్తానికి రైతాంగం పడుతున్న అవస్థలకు అన్నదాత పోరులో ఈ ప్రదర్శన హైలెట్‌గా నిలిచి పలువురి దృష్టినీ ఆకర్షించింది.

రైతులను అష్టకష్టాలకు గురిచేస్తున్న కూటమి ప్రభుత్వం



యూరియా కొరత రైతాంగాన్ని పట్టి పీడిస్తోంది. నల్లబజారులో కనీసం రూ.200 అధికంగా ఇస్తేగానీ బస్తా యూరియా లభించడం లేదు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో రైతు భరోసా కేంద్రాల ద్వారా ఆయా గ్రామాల్లో రైతులకు ఎరువులు, ఇతరత్రావన్నీ సకాలంలో అందేవి. కూటమి ప్రభుత్వ పాలన రైతులు ఎరువుల కోసం నానాపాట్లు పడుతున్నారు. అష్టకష్టాలు పడుతున్నారు.

-చంద్రమౌళిరెడ్డి, పార్టీ రైతు విభాగం జిల్లా అధ్యక్షులు

జగనన్న పాలనలో రైతే రాజు



గత ఐదేళ్ల జగనన్న పాలనలో రైతులంతా రాజుల్లా బతికాం. యూరియా కోసం ఏ ఇబ్బందులూ పడలేదు. ఇప్పుడు కూటమి పాలనలో దొరకడం కష్టంగా మారింది. బస్తా రేటు కంటే ఎక్కువ ఇవ్వాల్సి వస్తోంది. పోనీ అలా కొందామన్నా దొరకడం లేదు. అంతదూరం వచ్చి ఉసూరోమంటూ వెనక్కి పోవాల్సి వస్తోంది. ఇకనైనా ప్రభుత్వం రైతుల బాధలపై స్పందించాలి.

-కుప్పిరెడ్డి రామకృష్ణారెడ్డి, రైతు

కూటమి ప్రభుత్వంలో రైతుల ఆత్మహత్యలు



కూటమి ప్రభుత్వం వచ్చాక రైతులు ఆత్మహత్యలు చేసుకోవడం తప్ప మరో దారి కనిపించడం లేదు. ప్రభుత్వ నుంచి సాయం అందక, సకాలంలో ఎరువులు దొరక్క మా పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. ఇప్పుడే ఇలా ఉంటే వచ్చే మూడేళ్లు ఊహించుకుంటే భయమేస్తోంది. ఎరువుల కోసం అగచాట్లు పడుతున్నాం. పంటల సాగు చేయాలంటేనే గగనంగా మారుతోంది.

-మునిసుబ్రమణ్యంరెడ్డి, రైతు

బ్లాక్ మార్కెట్‌లో ఎరువులు



రైతులకు ప్రభుత్వం ఇచ్చే ఎరువులను బ్లాక్ మార్కెట్లో కొనాల్సిన పరిస్థితి కలిగింది. యూరియా బస్తాలు లభించకపోవడంతో ఎక్కువ రేటుకు కాంప్లెక్స్ ఎరువులు కొనాల్సిన వస్తోంది. గతంలో ఎప్పుడూ ఇలా జరగలేదు. యూరియా కోసం వెళితే గంటల తరబడీ క్యూలో ఎండలో నిలబడినా ఒక్క బస్తా కూడా దొరకడం లేదు. యూరియా కొరత లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

- శంకరయ్య, రైతు

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు బ్రహ్మాండంగా ఉండాలి

తిరుపతి తుడా: శ్రీవారి బ్రహ్మోత్సవాలకు నగరంలో ఏర్పాట్లు బ్రహ్మాండంగా చేయాలని, పారిశుద్ధ్య పనులు మెరుగు పరచాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో నగరంలో పారిశుద్ధ్యం, ఇతర అంశాలపై మంగళవారం నగర పాలక సంస్థ, టీటీడీ అధికారులతో కమిషనర్ సమీక్షించారు. నగరంలోని అన్ని ప్రాంతాల్లో టీటీడీ, నగరపాలక సంస్థ అధికారులు సమన్వయం చేసుకుని పారిశుద్ధ్యం మెరుగు పరచాలని, భక్తుల సంచారం ఎక్కువగా ప్రాంతాల్లో మొబైల్ టాయిలెట్స్ ఎక్కువగా ఏర్పాటు చేయాలని, ప్రధాన కూడళ్లలో విద్యుత్ దీపాలంకరణలు చేయాలని అధికారులను ఆదేశించారు. అదనంగా సిబ్బందిని ఏర్పాటు వేసుకోవాలన్నారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, టీటీడీ సూపరింటెండెంట్ ఇంజినీర్ చంద్రశేఖర్, మునిసిపల్ అధికారులు, హార్టికల్చర్ ఆఫీసర్ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు

కొడుకుల నుంచి ప్రాణ హాని..!

ఓ తండ్రి ని‘వేదన’

తిరుపతి కల్చరల్: తన కన్నకొడుకులు తన ఆస్తి, తన ఉద్యోగంపై దురాశతో తనపై దాడి చేసి చంపేందుకు ప్రయత్నిస్తున్నారని, వారి నుంచి తనకు రక్షణ కల్పించాలని టీటీడీ ఉద్యోగి చంద్రశేఖర్ పోలీసుల అధికారులకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. తన భార్య మీనాకుమారి తనతో విభేదాల కారణంగా 12 ఏళ్ల క్రితం విడిపోయిందని తెలిపారు. తన తల్లి పేరిట వరదరాజనగర్‌లోని భవనం ఉందని, ఆమె తదనంతరం తనకు చెందేలా వీలునామా రాశారన్నారు. తన భార్య విడిపోయాక తన ఇద్దరు కుమారులు తేజసాయి, మహేష్‌బాబు ఆమె వద్దకు చేరారని, నాలుగేళ్లుగా పూర్తిగా గంజాయికి బానిసలై తన నివాసానికి వచ్చి, దాడి చేసి కొట్టారని, హతమారుస్తామని బెదిరిస్తున్నారని తెలిపారు. తనను హతమార్చి తన ఉద్యోగం, ఆస్తులు పొందాలని యత్నిస్తున్నారని పేర్కొన్నారు. దీనిపై పోలీసులను ఆశ్రయించినా స్పందన లేదని, ఉన్నతాధికారులైనా స్పందించాలని విజ్ఞప్తి చేశారు.



ఇన్సూరెన్స్ నగదు పంపిణీ

పాకాల : రోడ్డు ప్రమాదంలో మరణించిన మహిళ కుటుంబానికి ఇన్సూరెన్సు సొమ్మును అందజేసినట్టు స్థానిక యూనియన్ బ్యాంకు మేనేజర్ చందమామ అశోక్ తెలిపారు. గత ఏడాది డిసెంబర్‌లో రోడ్డు ప్రమాదంలో రూప అనే మహిళ మరణించిందని, ఆమె తమ బ్యాంకులో వ్యక్తిగత ఖాతా కలిగి ఉండేదని, ఆ ఖాతా ద్వారా పీఎంఎస్‌బీవై, పీఎంజేజేబీవై ఇన్సూరెన్సు పాలసీలు తీసుకున్నారని చెప్పారు. ఆమె మరణించడంతో కుటుంబ సభ్యులు ఇన్సూరెన్స్ క్లైమ్ చేయడంతో మొత్తం నగదు రూ.4,00,000లను ఫీల్డ్ ఆఫీసర్ కీర్తన చేతుల మీదుగా అందజేసినట్టు తెలిపారు.



ఇన్సూరెన్స్ నగదును అందజేస్తున్న బ్యాంకు మేనేజర్, కీర్తన

మాజీ ఎమ్మెల్యే తల్లికి అస్వస్థత

- హాస్పిటల్‌కు వెళ్లి పరామర్శించిన భూమన, సిపాయి తదితరులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ‘అన్నదాత పోరు’ నిరసన ర్యాలీగా బయలు దేరుతున్న సమయంలో శ్రీకాళహస్తి మాజీ శాసన సభ్యులు బియ్యపు మధుసూదన్‌రెడ్డి తల్లి ఇంట్లో అపస్మారక స్థితిలోకి జారుకున్నారు. హుటాహుటిన ఆమెను ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. రక్తపోటు పడిపోవడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లారని గుర్తించిన వైద్యులు చికిత్స చేశారు. ఇది తెలుసుకున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకర రెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, సత్యవేడు సమన్వయకర్త రాజేష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ అనంతరం హాస్పిటల్‌కు వెళ్లి మాజీ ఎమ్మెల్యే తల్లిని పరామర్శించారు. ఆమె ఆరోగ్యం ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు. రాత్రి ఆమె ఆరోగ్యం కుదుట పడడంతో డిశ్చార్జి చేశారు.



మధుసూదన్‌రెడ్డి తల్లిని పరామర్శిస్తున్న భూమన తదితరులు

సేంద్రియ ఎరువులతో భూసారం పెంపు



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

రామచంద్రాపురం: సేంద్రియ ఎరువులతో భూసారం పెరగడమే కాకుండా ఆరోగ్యకరమైన దిగుబడులు పొందవచ్చని వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ ఏ.రామకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని పీవీ.పురం, సంజీవరాయపురంలో పొలం పిలుస్తోంది, భూ రక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. వేరుశనగ, మామిడి పంటలను పరిశీలించి తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను తెలియజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మమత, రైతు సేవా కేంద్రం వీహెచ్‌ఏ జాహ్నవి, వ్యవసాయ అధికారులు సౌందర్య, మాధవి, రైతులు పాల్గొన్నారు.

మామిడి రైతులకు బిల్లులు చెల్లించాలి


-రైతు సంఘ నేతలు డిమాండ్



సమావేశంలో రైతు సంఘ నేతలు

తిరుపతి కల్చరల్: ఉమ్మడి చిత్తూరు జిల్లా మామిడి రైతులకు బకాయి బిల్లులను సత్వరమే చెల్లించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రామానాయుడు, హేమలత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం గంధమనేని శివయ్య భవన్‌లో టి.జనార్ధన్ అధ్యక్షతన మామిడి రైతుల సంక్షేమ కమిటీ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ, రెండు నెలలుగా మామిడి రైతుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరితో వ్యవహరిస్తోందని మండిపడ్డారు. జిల్లా అధికారులు ఈ సమస్యకు పరిష్కారం చూపడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారని, ప్రభుత్వం నిధులు రూ.260 కోట్లు విడుదల చేసి రెండు నెలలు కావస్తున్నా గుజ్జు యజమానులతో లాలూచీ పడి ఇప్పటికీ నిధులు విడుదల చేయలేదని ఆరోపించారు. ఇకనైనా స్పందించకపోతే అక్టోబర్ ఒకటవ తేదీ నుంచి ఆందోళనకు పూనుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మామిడి రైతు నేతలు సి.మునీశ్వర్‌రెడ్డి, బెల్లంకొండ శ్రీనివాసులు, మణిరత్నం నాయుడు, గోవిందస్వామి, నాగరాజు పాల్గొన్నారు.

బంగారు తిరుచ్చిపై విహారం



బంగారు తిరుచ్చిపై భక్తులకు అభయమిస్తున్న సుందర రాజస్వామి

చంద్రగిరి: తిరుచానూరు శ్రీపద్మావతి ఆలయ అనుబంధ శ్రీసుందర రాజస్వామి మంగళవారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై భక్తులకు అభయమిచ్చారు. నాలుగు మాడవీధులలో ఊరేగుతూ భక్తులను దర్శనమిచ్చారు. ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్విమ్స్ వర్సిటీ డీన్‌గా అలోక్ సచన్

తిరుపతి తుడా: స్విమ్స్ యూనివర్సిటీ నూతన డీన్‌గా ఎండోక్రైనాలజీ విభాగాధిపతి డాక్టర్ అలోక్ సచన్ నియమితులయ్యారు. డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్ ఆయనకు నియామక పత్రం మంగళవారం అందజేశారు. స్విమ్స్ వర్సిటీ, ఆసుపత్రి అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.



నియామక పత్రం అందజేస్తున్న డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్